**ఆడవాళ్ళ హృదయం పువ్వుకంటె కోమలం వజ్రంకంటే కఠినం అన్న కవిమాట నిజమేనా ?**

# సులోచనాలు

పాలకూర సీతాలత

**అద్దంముందు కూర్చున్న శేషగిరి ఆడపిల్లకంటె అవ్యాయంగా అరగంట పైనుంచీ ముస్తాబు అవుతున్నాడు. ఈనాటి ఈ ప్రత్యేక అలంకరణలో విశేషం లేకపోలేదు. తను రాసిన ఉత్తరానికి సులోచన జవాబు రాయడం అందుకు కారణం. జవాబు రాయడం ఒక్కటేగాదు, తను కోరినదానికి ఆమె అంగీకరిస్తున్నట్లుగా ఆ జవాబు ఉండటమే అందుకు కారణం.**

అంతగా శేషగిరి ఆనందపడిపోవడానికి. హడావుడిపడి ఊరికే ఇదై పోవడానికీ కారణం సులోచన ఉత్తరమేనా అని సందేహపడుతున్నారా? శేషగిరే ఏంఖర్మ! ఏ మగవాడికైనా ఆ సందర్భంలో అలాంటి చేష్టలు సహజం. శేషగిరితో పెళ్ళికి తను సిద్ధం అనీ. 15వ తేదీ సాయంత్రం బస్సులో వస్తున్నాననీ రాసింది సులోచన.

జేబులోంచి సులోచన ఉత్తరం ఒకసారి తీశాడు. ఉత్తరం చాలా సంగ్రహంగా వుంది. హడావుడిగా రాసినట్లు ఆ అక్షరాలు చెబుతున్నాయి. ఎందుకో అంత తొందర!

"డియర్ గిరీ!

15వ తేదీ సాయంకాలం మీ వూరు వచ్చే బస్సులో వస్తున్నాను. నువ్వు బస్టాండ్‌కు వస్తే మంచిది. మన పెళ్ళి త్వరగా జరిగిపోవాలి. ఏర్పాట్లు అన్నీ



చేయించు. మిగతా వివరాలు సముఖంలో.

నీ సులోచన...."

ఉత్తరాన్ని ఒక మాటు ముద్దుపెట్టుకున్నాడు. 'స్వీట్ సులోచన....' అనుకున్నాడు. టైము చూశాడు— నాలుగయింది.

బస్సు అయిదుగంటలకు వస్తుంది. హాల్లో కూర్చుని వంటవాడు పంపిన కాఫీ తాగాడు.

ఇంతలో అరుణ వచ్చింది. అరుణ శేషగిరి కూతురు. పదేళ్ళుంటాయి.

"ఏంటి డాడీ! ఎక్కడికైనా వెళుతున్నారా?" అడిగింది.

ఎక్కడికైనా వెళుతున్నప్పుడు ఎవరైనా అడిగితే శేషగిరికి బోలెడు కోపం. అరుణ మీద కూడా కోపం వచ్చిందిగానీ కోపగించుకోలేకపోయాడు. పిచ్చిపిల్ల. తల్లిలేని బిడ్డ. తల్లి నోట్లోంచి ఊడినట్లు అంతా తల్లి శారద పోలిక.

"అవునమ్మా కొంచెం పనివుంది. ఒక గంటలో వచ్చేస్తాను—" అన్నాడు.

"నాన్నా! ఇంట్లో ఒక్కదానికీ బోరు కొడుతోంది...." అంది గారంగా. అరుణని స్కూలుకు పంపడు. డబ్బున్నవాడు. ఆమె స్కూల్లోచేరి అందరితోకలవడం ఇష్టంలేదు. అందుకే ట్యూషన్ పెట్టించాడు ఇంటిదగ్గర.

"ఇవాళ ఒక ఆంటీవస్తుంది. ఇంకనీతోనే వుంటుంది. నీకు బోలెడు కాలక్షేపం...." అన్నాడు అరుణతో.

"నిజంగానా? భలే...." సంతోషంగా అంది అరుణ.

"అవును. వస్తానమ్మా!" అంటూ బయలుదేరాడు.

సంచలనం
ఒకేసారి 4 గొప్ప పుస్తకాలు
చదవండి! చదివించండి!
నేడే మీ ఆర్డరు పంపండి
అక్టోబరు 2 విడుదల
మాదిరెడ్డి సులోచన
ప్రేమించాను......వెల:10-00
ఆర్.సంధ్యాదేవి
ఆరనిజ్వాల......వెల:10-00
మాలతీచందూర్
పరీక్ష..........వెల:10-00
జొన్నలగడ్డ లలితాదేవి
ఆవిడగారి ఆయనగారు....వెల:10-00
పై నాలుగు పుస్తకాలు కావలసినవారు అక్టోబరు 2వ తారీఖులోపు రు10/-లు ముందుగా పంపినవారికి మామూలు కమీషను గాక స్పెషల్ కమీషను రు.4లు ఎగస్ట్రా ఇవ్వబడును. అడ్వాన్సుగా రు.10లు పంపించి మీ 4 పుస్తకాలు V.P.P. లో పొందగలరు.
VTS/5/
స్నేహసాహితి
శివాలయంవీధి
విజయవాడ-520001.

కారు తీశాడు షెడ్‌లోంచి. స్వయంగా డ్రైవ్ చేస్తూ బస్‌స్టాండ్ వైపు పోనిచ్చాడు. కారు ముందుకు వెళ్తుంటే అతని ఆలోచనలు వెనక్కు గతంలోకి మళ్ళాయి.

'ఇరవై సంవత్సరాలు ఎంత త్వరగా దొర్లిపోయాయి....

ఆ రోజుల్లో తను ఎమ్మెస్సీ చేస్తుంటే సులోచన బియ్యేస్సీలో వుండేది.

అందరూ తమది లైలా మజ్నూల ప్రేమ అనేవారు.

ఒకటి మాత్రం నిజం అయింది.

ఆ లైలా మజ్నూల లాగే ఇద్దరూ అప్పుడు విడిపోవల్సి వచ్చింది.

ఆ రోజుల్లో.... ఆ రోజుల్లో....

*

ఆ కాలేజీ వార్షికోత్సవ సందర్భంలో స్టేజిమీద "నవీన యుగంలో స్త్రీ పాత్ర" అన్న అంశంమీద ఒక పురుషుడు లెక్చర్ ఇచ్చాడు. ఇవ్వడం ఏమిటి, దంచేశాడు, దున్నేశాడు.

"స్త్రీ లేనిదే అసలు జీవితం లేదు. ఆమె మానవ జీవితానికి వూపిరి. ఒకప్పుడు వంటింటి కుందేలన్న ముద్రవేసుకున్నా ఈ రోజుల్లో రాజ్యాలు ఏలుతూ, రాకెట్లు నడుపుతూ పురుషుడితో సమంగా పోటీ చేస్తూంది. ఇది చాలా మంచి లక్షణం. స్త్రీ అభివృద్ధికి ఇది తొలిసోపానం. స్త్రీలు తమ సహజసిద్ధమైన భయాన్ని విడిచిపెట్టాలి. అన్ని రంగాల్లో ముందుకు రావడానికి ప్రయత్నించాలి. తనను తాను లోకువ చేసుకోవడం మానెయ్యాలి. ప్రగతిపథంలో పయనించాలి...."

ఈ రకంగా లెక్చర్ ఇచ్చినది ఎమ్మెస్సీ స్టూడెంట్ శేషగిరి. అందుకు అతనికి ఫస్టు ప్రైజు రావడం తర్వాతి విషయం. సులోచన పరిచయం కల్గడం ముందు విషయం.

అతని లెక్చర్ విని ఆకర్షింపబడ్డ బియెస్సీ స్టూడెంట్ సులోచన అతను స్టేజి దిగగానే కంగ్రాట్స్ చెప్పింది.

ఈ మెరుపుతీగని చూసిన శేషగిరి కళ్లు మెరిశాయి.

"ఆడవాళ్ళ అభివృద్ధికోసం అలమటించే మగవాడ్ని ఒక్కడ్ని చూశాను. చాలా సంతోషం. మీ లాంటి వారే అందరూ అయితే ఆడవాళ్ళకి అసలు సమస్యలు వుండవు." అని శేషగిరిని పొగిడింది.

అతను కూడా దొరికిన అవకాశం వదులుకోలేదు. ఆమె మంచితనం వల్లే అలా మాట్లాడింది అన్నాడు. ఆ తర్వాత ఆమె అందాన్ని పొగిడాడు.

ఈ రకంగా పరిచయం అయింది. శేషగిరి, సులోచనల మధ్య ప్రేమ బంధం పెనవేసుకుంది.

ఒకర్ని విడిచి ఒకరు వుండలేనంత గొప్పగా వారిమధ్య అనురాగలత అల్లుకుంది.

ఒకరోజు శేషగిరి అన్నాడు సులోచన చేతిగాజుల్ని సవరిస్తూ—

"మీవాళ్ళు మనపెళ్ళికి ఒప్పుకుంటారా?"

సులోచన ఆలోచించింది. తండ్రి సీతారామయ్య బడిపంతులు. తల్లి చిన్నప్పుడే పోయింది. తమ్ముడు విక్రమార్క ఇంకా స్కూల్లో చదువుకుంటున్నాడు. తండ్రి తన పెళ్ళికోసం వెనుక వేసిందీ, వేయబోయేదీ ఏమీలేదు. తండ్రికి శేషగిరితో వివాహం ఏ రకంగానూ అభ్యంతరం వుండదు. పైగా కులం కూడా ఒకటే కనుక సంప్రదాయపు పట్టింపులు లేవు.

"మావాళ్ళు అభ్యంతరం చెప్పరు. మరి మీవాళ్ళో......" అంది కొంచెం వంకయిస్తున్నట్లు.

శేషగిరీవాళ్ళు మధ్యతరగతివాళ్ళే ఐనా అందులో కొంచెం పై మెట్టుకి చెందినవారని చెప్పాలి. పదిహేను ఎకరాల పొలం వుంది. తండ్రికి అతనొక్కడే. కానైతే తండ్రి కొంచెం డబ్బుమనిషి. పేరు వరదరాజు.

సినిమాల్లో రావు గోపాలరావు పాత్ర లాంటివాడు. గట్టికంఠం. మామూలుగా మాట్లాడినా శాసించినట్లే వుంటుంది. తండ్రి తన ప్రేమ వివాహానికి అంతత్వరగా ఒప్పుకుంటాడని అన్పించలేదు.

"రేపు నాన్నగారితో మాట్లాడాలనుకుంటున్నాను." అన్నాడు నిశ్చయంగా.

"సరే...." అంది సులోచన భవిష్యత్తులోకి ఆశగా చూస్తూ.

* * *

కళ్ళజోడులోంచి చిత్రంగా చూశాడు వరదరాజు కొడుకువైపు. విచిత్రంగా నవ్వాడు. ఆనవ్వుకు భయపడ్డాడు కొంచెం శేషగిరి.

"నిన్ను కాలేజీకి పంపుతున్నది చదువుకుంటుకా, ప్రేమలో పడ్డానికా ?" అడిగేడు కొంచెం తీక్షణంగా.

నసిగాడు...."చదువుకుందుకే...."

"అయితే ముందు ఆ పని చెయ్యి. ఈ ప్రేమలూ, దోమలూ వ్యవహారంలో నాకు నమ్మకం చాలా తక్కువ. ఆ అమ్మాయితో షికార్లు కొట్టడం ఆపుచేసి ముందు డిగ్రీ తెచ్చుకో. ఆ తర్వాత ఉద్యోగం తెచ్చుకో. ఆ తర్వాత ఆలోచిద్దాం పెళ్ళిసంగతి.... ఆ అమ్మాయి తండ్రి బడిపంతులన్నావు కదూ....అయితే ఆ అమ్మాయితో నీ పెళ్ళి డిగ్రీ వచ్చాక కూడా జరగదనే గుర్తుంచుకో. డబ్బున్న పిల్లను ఎలాగో ఎరవేసి నిన్ను కట్టబెట్టాలన్నది నా ఆశ. మనకంటే

ధనవంతులతో వియ్యం పొందుతాను కానీ తక్కువ వాళ్ళతో కాదు...."

చెప్పడం ఆపుచేశాడు వరదరాజు. జేబు లోంచి చుట్టతీసి కొసకొరికి దానికి నిప్పు పెట్టాడు. మళ్ళీ మొదలుపెట్టాడు:

"అర్థం అయిందనుకుంటా. నాకు ఎదిరించి జవాబు చెప్పే ధైర్యం నీకు లేదని నాకు తెల్సు. నిన్ను ఆ రకంగానే పెంచాను. ముందు చదువు కానియ్యి. నేను చూపించిన పిల్ల మెడలో తాళి కట్టు. ఇప్పుడే తొందర పడకు. ఆడపిల్ల విషయంలోనే రాసినా ఆ పాట ఏంటదీ 'తొందరపడి ఒక కోయిల ముందే కూసింది....' అని కదూ! అలా ముందే కూసెయ్యకు వెళ్ళు...." అన్నాడు. శేషగిరి ఇంకా అక్కడే నిల్చున్నాడు.

"వెళ్ళమని చెప్పింది విన్నే" కొంచెం గట్టిగా అన్నాడు.

అంతే! అక్కడ్నుంచి శేషగిరి మాయం అయ్యాడు.

'ముందు చదువు పూర్తిచేసి ఉద్యోగం వచ్చేదాకా ఈ ప్రేమ వ్యవహారం గుట్టుగా వుంచుదాం. ఆ తర్వాత నన్ను ఎవరూ అడ్డగించలేరు....'

అలాగే రోజులు గడిచాయి. శేషగిరి చదువు పూర్తిఅయ్యింది. ఉద్యోగ ప్రయత్నంలో పడ్డాడు. అక్కడకు రెండు వందల మైళ్ళ దూరంలో వున్న నెల్లూరు కాలేజీలో లెక్చరర్‌గా ఉద్యోగం వచ్చింది. చేరి పోయాడు. ఒక ఆర్నెల్లు అలాగే గడిచి పోయాయి. ఇంతలో సులోచన చదువు పూర్తయ్యింది. ఆమెకు తండ్రి సంబంధాలు చూడ్డం మొదలుపెట్టాడు. ఆమె శేషగిరికి విషయం తెల్పుతూ వుత్తరం రాసింది. "అనుకున్నట్లుగా ఉద్యోగం దొరికి సెటిలయ్యాడు కనుక పెళ్ళి చేసుకోమని" ఆత్రంగా రాసింది. పాపం, ఆడకూతురు!

కానీ ఇక్కడ శేషగిరి పరిస్థితి వేరే విధంగా వుంది. అతని గర్ల్‌స్టూడెంట్ శారద అతన్ని ఆకర్షించింది. శారద లక్షాధికారి లాయర్ కూతురు. సులోచన ఒకమామూలు సినిమాలాగ, శారద ఒక ఈస్టుమన్ కలర్ సినిమాలాగ అన్పించింది శేషగిరికి. దానికి తోడు శారద కూడా అతన్ని ప్రేమించడం అతని అదృష్టం. "నీ రొట్టె విరిగి నేతిలో పడింది"—అతని మనస్సు అంటే దాన్ని గట్టిగా కోప్పడి "ముందు నుంచీ నా రొట్టె నేతిలోనే వుంది" అన్నాడు. "తంతే బూరెల బుట్టలోపడ్డట్లు అయిందిలే నీ పని" అంది మనసు. మళ్ళీ గట్టిగా కోప్పడి "బూరెల బుట్టని తంతే అదే నా దగ్గరకు వచ్చింది" అన్నాడు.

శారద తండ్రి లక్షలు వెనకేశాడు. అన్యాయపు కేసులు గెలిపించి ఆ డబ్బు సంపాదించాడో, న్యాయమైన కేసులు ఓడించి


107 స్పెషల్ డిటర్జెంట్ బార్.

ఇది యిచ్చే ఎక్కువ తెల్లదనానికి కారణం? దీనిలో వున్నది-'గుట్టుగా' తెల్లపరిచే పదార్థం!




107 స్పెషల్ డిటర్జెంట్ బార్ సోపులోనే వుంది ప్రత్యేక తెల్లదనం యిచ్చే సీక్రెట్ ఏజెంటు. అధికమైన తెలుపుకీ మెరుపుకీ ఇదే కారణం.

ఒత్తుగా వచ్చే నురగలు మురికిని వదలగొడతాయి. అంతేకాదు - యీ బార్ సోపు మంచి ఆదా కూడా.

ఉత్పత్తిదారులు :
అల్ట్రా మరైన్ అండ్ పిగ్మెంట్సు లిమిటెడ్
రాణిపేట-632 403

ఆ డబ్బు సంపాదించాడో చెప్పడం కష్టం. ఆయన ఇల్లు డైరెక్టుగా సినిమా షూటింగ్‌కు వాడుకోదగినంత బ్రహ్మాండంగావుంటుంది. ఒక్కత్తే కూతురు. ఆమె మనోహరుడు ఎలాంటివాడైనా పెళ్ళి చెయ్యడానికి అభ్యంతరంలేదు. శారద ఒకరోజు శేషగిరిని చూపించి "అతన్నే పెళ్ళిచేసుకుంటా" అంది. ఆయన ఏమీ ఆలోచించకుండా "సరే" అన్నాడు.

కథ ఈ మలుపు తిరిగేసరికి శేషగిరికళ్ళకి శారద దేవకన్యలాగ. సులోచన దెయ్యంలాగ అన్పించసాగింది. శారదతో పొందు కల్పివచ్చిన అదృష్టంగానూ. సులోచనతో పొందు భరించరాని భయంకర దురదృష్టంగానూ అన్పించింది. శారదమాటలు దివ్యమైన వీణా నాదంలాగ. సులోచన పలుకులు గార్ధభ గాత్రంలాగ ఫీలయ్యాడు. శారద నడకలో అందమైన మయూరితోస్తే సులోచన అడుగుల్లో గున్న ఏనుగు గుర్తొచ్చింది. శారద సంస్కారవంతురాలుగానూ సులోచన దేభ్యం మొహంలానూ అన్పించింది. ('లేకపోతే ఏ ఆడదైనా బరితెగించి "నన్ను పెళ్ళాడు" అంటూ ఉత్తరాలు రాస్తుందా?') శారదనిచూస్తే పంచదార చిలుకా.పనసతొనా గుర్తుకువస్తే సులోచనను తల్చుకోగానే చెత్తకుండీ. మురుగుకాలవ గుర్తుకు వచ్చాయి. శారదను చూసినప్పుడు మల్లెపువ్వు. సులోచనను తలచినప్పుడు ఉల్లిపువ్వు గుర్తువచ్చాయి. చామనచాయలో వుండే శారద చామనచాయకాదు మల్లెపూరంగు అనీ. పాలకోవారంగు సులోచన పాలకోవారంగు కాదు మాడిపోయిన పెనం అనీ అన్పించింది.

ఆ రోజే తమ ఊరుకి రెండు ఉత్తరాలు రాసిపడేశాడు. ఒకటి తండ్రికి. రెండోది సులోచనకు. రెండూ ఒకే కలంతో ఒకే యింకుతో రాసినా ఒకటి గుండెలు పండించేదిగానూ మరోటి గుండెలు మండించేదిగానూ వుంది. నిజమే! స్వర్గమైనా నరకమైనా దేముడే సృష్టిస్తాడు. మల్లెపందిరినీ ముళ్ళపొదల్నీ కూడా వీరే పెంచుతుంది.

'శభాష్! ఇన్నాళ్ళకు ఒక ఘనకార్యం చేశాడు. లక్షాధికారి కూతుర్ని ప్రేమించి ప్రేమింప చేసుకుని పెళ్ళికి వొప్పించాడు. వాడిని చూసి గర్విస్తున్నాను. త్వరలో ఈ పెళ్ళి చెయ్యాలి....' అనుకున్నాడు వరదరాజు.

ఆ తర్వాత సులోచన నుంచి ఏకబురూ. కాకరకాయలేదు. శారదని వైభవంగా పెళ్ళి చేసుకున్నాడు. శారదతో కాపురం అరుణఫలం. ఆ తర్వాత శారదకు అనుకోకుండా కాన్సర్ సోకింది. ఆ రోగంతో మూడు సంవత్సరాల తర్వాత మరణించింది. కూతురంటే అమిత ప్రేమగల లాయర్ గారు కూడా మరో రెండు సంవత్సరాల తర్వాత కూతురు వెళ్ళిన దారినే వెళ్ళిపోయారు.

లంకంత ఇంట్లో శేషగిరి. అరుణ. అరుణ పోషణకై ఆయాని పెట్టాడు. వంటవాడున్నాడు. లెక్చరర్‌గా పనిచేస్తూ లక్షల ఆస్తి అనుభవిస్తూ రెండో పెళ్ళికి ఎందరో బలవంతం చేసినా ఒప్పుకోకుండా రోజులు వెళ్ళతీశాడు.

ఏడాది క్రితం అతనికి సులోచన గురించి తెల్సింది. అప్పుడు అతనిలో కోరిక కల్గింది. 'పెళ్ళి చేసుకోకుండా ఏదో ఉద్యోగం చేసుకుంటూ వుండిపోయింది సులోచన. ఒకవేళ ఇప్పుడు ఆమెను పెళ్ళి చేసుకుందుకు అడిగితే ఆమె వొప్పుకుంటుందేమో!' అన్పించింది. సులోచన గురించి వివరాలు ఎలా తెలిశాయి అంటే—

శేషగిరికి అభిమాన విద్యార్థి విక్రమార్క. అతనికి వేరేచోట సీటు రాకపోపడంతో నెల్లూరులోనే సీటు సంపాదించి రూము తీసుకుని వుంటున్నాడు. ఒకరోజు విక్రమార్క పర్సులో ఒక అమ్మాయి ఫోటో చూశాడు శేషగిరి.

ఆశ్చర్యపోతూ యెవరని ప్రశ్నించేడు.

"మా అక్కయ్య...." అన్నాడు విక్రమార్క.

ఆమెనుగురించి వివరాలు చెప్పాడు విక్రమార్క.

"కాలేజీలో వుండగా యెవర్నో ప్రేమించిందట. అతను ఉద్యోగం రాగానే పెళ్ళి చేసుకుంటానని మాట యిచ్చేడట. ఈ సంగతి తెలియని తండ్రి తన తాహతుకి తగినదే అని ఒక రెండో పెళ్ళి సంబంధం తెచ్చాడట. పెళ్ళి చేసుకొమ్మని బలవంతం చేశాడట. అక్కడ్నుంచి పారిపోయి ఆ ప్రేమించినవాడి దగ్గరకు వెళ్ళిపోయి పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకొని అతనికి ఒక ఉత్తరం రాసిందట. ఫలానారోజు వస్తున్నాను అని. కానీ ఆ ఉత్తరం పోస్టుచేశాక ఆ ప్రియుడి దగ్గర్నుంచి ఒక ఉత్తరం వచ్చిందట. తల్లిదండ్రుల బలవంతం కారణంగా వేరే అమ్మాయిని చేసుకోవల్సి వస్తోందనీ. క్షమించమనీ రాశాడట. దాంతో అక్కయ్య మనసు విరిగిపోయింది." అన్నాడు విక్రమార్క.

"అలాగా. పాపం...."అన్నాడు జాలిగా శేషగిరి.

"ఆ తర్వాత నాన్నను కూడా ఎదిరించి ఇంక జన్మలో పెళ్ళిచేసుకోను అనిచెప్పింది. ఏదో కెమికల్ లాబ్‌లో ఉద్యోగం సంపాదించుకుంది. ఇప్పటికీ అలాగే వుంది. ఆ తర్వాత నాన్న పోయారు. నన్ను చదివిస్తోంది. నేను కూడా ఆమెకు చాలాసార్లు నచ్చచెప్పాను పెళ్ళిచేసుకోమని. కరిచినంత పనిచేసింది. జీవితంలో ఒక పిరికివాడిని ప్రేమించడం తనుచేసిన తప్పు అనీ మళ్ళా ఇంకో తప్పు చెయ్యననీ అనేది. వీలున్నపుడల్లా ఆ పిరికివాడిని ఆడిపోసుకునేది. ఆ పిరికివాడు...."

"అబ్బ! చాల్లేవయ్యా.... మాట్లాడితే 'పిరికివాడు' అని వందసార్లు అంటావేం?"

నాగేశ్వరీ వారి నవ నవలా తరంగాలు!

• జొన్నలగడ్డ లలితాదేవి
ప్రేమ సుందరి........ రూ. 11/-
జలతరంగిణి ......... రూ. 15/-

• గిరిజ శ్రీభగవాన్
ప్రేమపానం .......... రూ. 15/-

• కొడాలి సాంబశివరావు
స్వప్నరాగం............. రూ. 15/-

నాగేశ్వరీ పబ్లికేషన్స్
కాళేశ్వరరావు రోడ్ - సూర్యారావుపేట
విజయవాడ-2

rajaads

యన్.టి.ఆర్.
రాజకీయాల పరిశీలన

నటరత్న: మక్కళ్ తిలకం: రామాయణంలో పిడకల వేట

రచన: నాటి "ఆంధ్రప్రభ శాస్త్రి"

ఇందులో ఇంకా....

తెలుగువారి తెగులు: నటరత్న నాటకీయత: తిరపతిరభస

1/4 క్రౌన్ సైజు 40 పేజీలు

ధర 3/-లు

* విడికాపీకి అదనంగా రు. 3-50 రిజిష్టర్డు పోస్టేజికింద పంపాలి. అంటే మొత్తం రు. **6-50** పంపనిదే కాపీ పంపజాలము.

* పది పుస్తకాల పైనుంచి 25% డిస్కౌంట్. రవాణా చార్జీలు ఆర్డరు పంపినవారే భరించాలి.

* 50 కాపీల పైబడిన ఆర్డర్లకు లారీ సర్వీసులలో రవాణా చార్జీలు మేమే భరించి పంపగలము.

* సొమ్ము ముందుగా అందనిదే ఏ ఆర్డరు అంగీకరించబడదు.

For details please contact

**Cards Crafts Classics**
8 State Bank Street
P.B. No. 2421 Madras 2
Phone: 85029 & 83792


అన్నాడు శేషగిరి కొంచెం బాధగా.

"ఎవర్నో అంటే మీ కెందుకు సార్ బాధ? అదేదో మీ రే అయినట్లు....?" అన్నాడు విక్రమార్క.

తేలుకుట్టిన దొంగలాగ మాట్లాడలేదు.

ఆ తర్వాత తేనెలు ఒలికేలాగ ఒక ఉత్తరం తయారు చేశాడు.

అందులో చాలా భాగం సులోచనకు పొగడ్తలే.

"సులోచనా! ఆ నాడు నిన్ను కాదని పెళ్ళి చేసుకున్నది పెద్దల బలవంతంవల్లనే అని నీకు తెలుసు. ఒక కూతురు పుట్టాకా నా భార్య చనిపోయింది. అప్పట్నుంచీ రెండవ పెళ్ళికి ఎవరు బలవంతం చేసినా వినకుండా రోజులు గడిపాను. రోజూ నీ గురించిన ఆలోచనలే. నీకు అన్యాయం చేసినందుకే భగవంతుడు నాకు ఈ శిక్ష విధించాడని అనుకునేవాడిని. ఇన్ని రోజులూ నీతో గడిపిన రోజుల మాధుర్యాన్ని తల్చుకుంటూ గడిపేను. పగలయినా, రాత్రయినా నీ చింతలోనే బ్రతుకు వెళ్ళదీశాను.

ఆ రోజునుంచీ నీ గురించి నాకు తెలుస్తూనే వుంది. నా మీద కోపంతో అవివాహితగానే వుండిపోయావు. ఒక రకంగా నువ్వు అలా నా కోసమే వుండిపోయావేమో! ఆ కాలేజీ రోజుల్లో మన మధ్య వుండే ఆకర్షణీయమైన ప్రేమలాంటిది కాక ఈ మధ్య నీపై ఒక అనురాగపూరితమైన ఆప్యాయత ఏర్పడుతోంది. నన్ను నేను కించపరుచుకుని ఇన్నాళ్ళూ ఆలస్యం చేశాను గానీ ఇంకా ముందే ఈ ఉత్తరం నీకు రాయవల్సింది.

నేను అడగాలే కానీ నువ్వు అంగీకరిస్తావన్న నమ్మకం నాకు వుంది. వెంటనే నీ అంగీకారం తెల్పుతూ జవాబు రాయి. ఆ తర్వాతి విషయాలు నేను చూస్తాను.

అవునంటావన్న నమ్మకం నాది.
నీ వాడు కావాలనుకునే
శేషగిరి.

ఒకరోజు వచ్చింది జవాబు. హడావుడిగా రాసిన ఉత్తరంలో 15వ తేదీ సాయంత్రం బస్సులో వస్తున్నట్లు, పెళ్ళికి యేర్పాట్లు చెయ్యమన్నట్లూ రాసింది. అందుకే కారు తీసుకుని బస్‌స్టాండ్‌కు బయలుదేరాడు.

* * *

బస్‌స్టాండ్ రాగానే "నో పార్కింగ్" అని రాసివున్నచోట కారు ఆపాడు శేషగిరి. అది మన భారతీయులకు అలవాటేగదా!

బస్సుగురించి అడిగాడు. మరో రెండు నిముషాల్లో బస్సు వచ్చింది. అది సులోచనావాళ్ళ ఊర్నించి నెల్లూరుకు నడిచే ఏకైక బస్సు. అందులో సులోచన లేదు.

సులోచన ఎందుకురాలేదా అని ఆశ్చర్యపోయాడు. కొంపదీసి నిర్ణయం మార్చుకోలేదు గద అని భయపడ్డాడు. బహుశా ఆరోజు బస్సు మిస్సుఅయి వుంటుందని అనుకొని ఇల్లుచేరాడు.

"ఆంటీ రాలేదా?" అరుణ అడిగింది.

"లేదమ్మా! బహుశా రేపు వస్తుందేమో!...." అన్నాడు ఆశగా.

ఆ మర్నాడుకూడా అదే బస్సువేళకి బస్‌స్టాండ్‌కు వెళ్ళాడు. నిరాశగా ఇంటికి వచ్చాడు. కానీ ఆశ్చర్యంగా మరొక గంట తర్వాత సూట్‌కేస్‌తో సులోచన శేషగిరి ఇల్లు చేరింది.

శేషగిరి ఆనందానికి అవధులులేవు. కొంచెం వయసు మీదపడినా సులోచనలో వేరే మార్పులేదు. సంతోషంతో ఆహ్వానించేడు.

"ముందు స్నానం అదీచేసి ఫ్రెష్‌కా.... తర్వాత మాట్లాడుకోవచ్చు...." అంటూ నౌకర్లనుపిల్చి హడావుడిచేశాడు. స్నానానికి ముందు ఆమెచేత బోర్నవిటా త్రాగించేడు.

స్థిమితపడ్డాకా అన్నాడు— "నిన్న బస్సులో వస్తానని ఉత్తరం రాసి ఈ రోజు ట్రెయిన్‌లో వచ్చావేం?"

"ఉత్తరమా? అసలు నేను ఉత్తరం రాయలేదు." అంది సులోచన తాపీగా.

"అదెలా? నువ్వు వుత్తరం రాశావు.." అంటూ వుత్తరం వెదికి ఆమెకు ఇచ్చాడు.

ఆశ్చర్యంగా చూస్తూ వుండిపోయింది. దాన్ని పూర్తిగా పరీక్షించింది. ఆ తర్వాత ఆమె గట్టిగా నవ్వసాగింది. ఎందుకంత వెర్రిగా నవ్వుతోంది అనుకున్నాడు శేషగిరి.

"అవును— ఇది నా ఉత్తరమే! కానీ నిన్న మొన్న రాసింది కాదు. పదిహేను సంవత్సరాల క్రితం మా నాన్న రెండో పెళ్ళి సంబంధం ఖాయం చెయ్యబోతుంటే నీకు ఉత్తరం రాశాను. మనిద్దరం త్వరలో పెళ్ళి చేసుకుందుకు ఏర్పాట్లు చెయ్యమనీ, 15 వ తేదీన ఎవ్వరికీ తెలియకుండా నీ దగ్గరకు వస్తున్నాననీ రాశాను—ఆ ఉత్తరం ఇది. 15 సంవత్సరాలకు 200 మైళ్ళు పయనించి నీకు చేరింది. హాట్సాఫ్ టు పోస్టల్ డిపార్ట్‌మెంట్. ఇదిగో ఈ డేటు చూడు 13-3-1965. కంగార్లో నువ్వు డేటు చూసి వుండవు...." అంది సులోచన.

ఆ ఉత్తరం తీసుకుని పరీక్షచేసి నిజమే అని నవ్వుకున్నాడు శేషగిరి.

"ఆ తర్వాతే నీ దగ్గర్నుంచి ఉత్తరం వచ్చింది. వేరే అమ్మాయిని చేసుకుంటున్నట్లు. అందుకే ఆ ఉత్తరంలో రాసినట్లుగా బయలుదేరలేదు నేను...." అంది కొంచెం రుద్ధకంఠంతో.

శేషగిరి ఫీలయ్యాడు. మాట మార్చాడు.

"ఈ రోజు నీరాక నాకుచాలా సంతోషం కలిగిస్తోంది సులోచనా! నాజీవితం సంపూర్ణం అయింది. నా అంత అదృష్టవంతుడు మరొకడు వుండడు...." అన్నాడు శేషగిరి.

"ఆ విషయం గురించి రాత్రి ఏకాంతంలో మాట్లాడుకుందాం...." అంది సులోచన.

రాత్రి పదిగంటలైంది. అరుణ నిద్రపోతోంది. శేషగిరి బెడ్‌రూమ్‌లో అతనూ, సులోచనా ఉన్నారు! మగవాడి బుద్ధి ఎంత చంచలం ?! తనది కాబోతున్న సులోచనను చూస్తే ఈ రోజే అతనిలో కోరికలు రేగుతున్నాయి.

శేషగిరికి కొంచెం దగ్గు వచ్చింది.

"అరే ! ఆ దగ్గు ఎన్నాళ్ళుగా ?" అంది సులోచన ఆత్రంగా.

"అబ్బే ! నాలుగైదు రోజులైంది...."

"అయితే నా దగ్గర మందు వుంది. కెమికల్ లాబరెటరీలో పని చేసిచేసి మందుల గురించి బాగా తెల్సుకున్నాను.... ఆ పాల గ్లాసు ఇవ్వు.... అందులో మందు వేస్తాను. అది తాగితే రేపటికి అంతా బంద్...." అని అతని దగ్గర గ్లాసు తీసుకుని ఏదో మందు వేసి అతనిచేత తాగించింది.

అతనికి వెంటనే నిద్రవచ్చింది. గొంతు బాగా మండింది. మంచంమీద అలాగే ఒరిగిపోయాడు.

సులోచన కూడా లేచింది నిద్రపోవడానికి.

తెల్లవారు ఝామున నాలుగ్గంటలకు అలారం కొట్టింది. నిద్రమాని ఆ అలారం కోసమే యెదురు చూసినట్లు తక్కున లేచిపోయింది సులోచన. లైటు వేసింది. సూట్‌కేస్ వొకసారి సర్దుకుంది. సబ్బుతో ముఖం రుద్దుకుంది. గజిబిజి అయిన జుట్టును సరిచేసుకుంది. సూట్‌కేసుతో శేషగిరి రూములోకి వచ్చింది. జీరోబల్బు వెలుగులో కమ్మగా నిద్రపోతూ కన్పించాడు శేషగిరి. ట్యూబ్‌లైట్ వేసింది. సూట్‌కేస్ క్రిందపెట్టి శేషగిరిని లేపింది. అతను లేచి వొళ్ళు విరుచుకుంటుంటే రూం తలుపులు లోపల్నుంచి వేసింది.

"గుడ్ మార్నింగ్...."అంది సులోచన.

శేషగిరికూడా అలాగే అన్నాడు. లేదా అన్నానని అనుకున్నాడు. నోరైతే కదిలింది కానీ శబ్దం బైటకు రాలేదు.

వికృతంగా నవ్వింది సులోచన.

"నువ్వు మాట్లాడలేవు. నీ గొంతు పోయింది. స్పెషలిస్టులు కూడా దీన్ని బాగు చెయ్యలేరు. నోరెట్టుకు బతికే లెక్చరరూ! ఇప్పుడెలాగ ?" అంది.

శేషగిరి కళ్ళలో క్రోధం.

"నేను చెప్పేది విన్పిస్తోందా ? విన్పిస్తోంటే సైగచెయ్యి. ఎందుకంటే కొంచెం చెముడు కూడా వస్తుందిలే...." అంది.

వినపడుతోందని సైగ చేశాడు.

"ఆడదంటే ఏమిటనుకున్నావ్? సంతలో చవగ్గా దొరికే చింతకాయ అనుకున్నావా? లక్షాధికారివి కావచ్చు. అయితే మాత్రం నువ్వు కోరావని పెళ్ళాంచచ్చిన నీ దగ్గరకు చంకలు గుద్దుకుని వస్తానని అనుకుంటావా ? నేనంటే ఎంత తేలికభావం ?.... వచ్చాను.... నీకు శాస్తి చెయ్యాలని వచ్చాను.... నీ గొంతు మూశాను.... నీ బ్రతుకు బండలు చేశాను...." కోపంగా అంది.

శేషగిరి కళ్ళు బేలగా చూస్తున్నాయి.

"ఆడది ప్రేమిస్తే అబలే. కానీ పగబడితే అది పాము. నువ్వు నన్ను ఎప్పుడూ సరిగ్గా చూడలేదు. సులోచనాలు ధరించి చూశావు.... అందుకే ఈ సులోచన నీకు రకరకాలుగా కన్పించింది. ప్రేమించినపుడు ఉన్నతంగా చూశావు. ఆ తర్వాత నేను వద్దనుకున్నప్పుడు తేలిక భావంతో చూశావు. ఈరోజు మళ్ళీ కావల్సినపుడు నా అనుమతి లేకుండానే నేను ఒప్పుకు తీరతాననే నమ్మక భావంతో చూశావు. కానీ ఈ సులోచన నీ భావాలన్నింటికీ అతీతురాలు. సులోచనాలు బైటకు విసిరి సరిగ్గా నన్ను చూడు. అర్థం అవుతాను...." ఆవేశంతో ఊగిపోతోంది. శేషగిరికి ఏడుపువస్తోంది. కాళ్లూ చేతులూ కూడా స్వాధీనం తప్పినట్లు అన్పిస్తోంది.

"నిన్న పాలల్లో ఒక కెమికల్ పోసి నీ గొంతు పూడ్చాను. నన్ను పట్టించగలనని అనుకోకు. ఏ ఆధారమూ విడిచిపెట్టకుండా తెలివిగా వ్యవహరించి పోతున్నాను. ఐదున్నరకు నాకు రైలు వుంది. అందులో వెళ్ళిపోతాను.

సులోచనని తేలిగ్గా చూసినందుకు ఫలితం అనుభవించు.

ఆడదానికి అన్యాయం చేసినవాడు ఏదో రోజు ఇలాగే నాశనం అవుతాడని గొంతెత్తి చాటు .... ఓ—సారీ.... నీ గొంతు లేవదు కదూ !.... వస్తాను. నీ లక్షల ఆస్తితో సుఖపడు. ఈ సులోచన కోరేది నిజాయితీ, మానవత్వంగల మహా నీయుడుగానీ లక్షలు కాదు. వస్తాను. బై ...."

సూట్‌కేస్ తీసుకుని శేషగిరికేసి ఒకసారి చూసి అతని గదిలో దీపం ఆర్పి తలుపు దగ్గరగావేసి బైటపడింది. వెళుతున్న ఆటోని ఆపి "రైల్వేస్టేషన్‌కి పోనియ్యి...." అంది.

వెళ్తూ వెళ్తూ శేషగిరికేసి చూసిన చూపుల్లో ఎంత తిరస్కారం వుందో, శేషగిరికి అది అర్థం అయిందో లేదో తెలియదు. ●


